## క్లుప్తంగా

### చెస్ టోర్నమెంట్ విజేతకు అభినందనలు



**తెనాలి టౌన్:** ఈనెల 9వ తేదీన తెనాలి పట్టణంలో నిర్వహించిన డిస్ట్రిక్ అండర్–17 చెస్ టోర్నమెంట్‌లో మారీసుపేటలోని సెయింట్ పాల్స్ ఇంగ్లిషు మీడియం స్కూల్ విద్యార్థిని సీహెచ్ ప్రిన్సెస్ రూబీ అండర్–10 విభాగంలో ప్రథమ బహుమతి సాధించినట్లు స్కూల్ ప్రిన్సిపాల్ టి.దివ్యతేజ తెలిపారు. సోమవారం స్థానిక పాఠశాలలో విద్యార్థినిని స్కూల్ డైరెక్టర్స్ తేజ్‌నాథ్, అకుల్‌నాథ్ మెమోంటోలతో సత్కరించారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని వారు కాంక్షించారు. కార్యక్రమంలో కోచ్ నిరంజన్, తదితరులు పాల్గొన్నారు.

### విశ్వబ్రాహ్మణ అపరకర్మశాల ప్రారంభం



**తెనాలి టౌన్:** స్థానిక రామలింగేశ్వరపేట గురవయ్య కాలనీలో సోమవారం పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘ ఆధ్వర్యంలో విశ్వబ్రాహ్మణ అపరకర్మశాల ప్రారంభించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ప్రముఖ న్యూరోసర్జన్ డాక్టర్ వజ్రాల శివకుమార్ పాల్గొన్నారు. సంఘ అధ్యక్షుడు జి.అర్జున్, ప్రధాన కార్యదర్శి శేషబాబు, కోశాధికారి లక్ష్మీప్రసాద్, సంఘ పెద్దలు కె.వెంకటేశ్వరరావు, పి.మణికుమార్, ఎం.సుబ్రహ్మణ్యం, హరిదాసు గౌరిశంకర్, గల్లా సతీష్, ఎం.శరత్, ఉదయ్‌శంకర్, తదితరులు పాల్గొన్నారు.

### కేజీఎఫ్ జెండా లోగో ఆవిష్కరణ



**తెనాలి టౌన్:** సమాజానికి నిస్వార్థ సేవలందిస్తున్న కమ్మ కులానికి అందరూ అండగా ఉండాలని కేజీఎఫ్ వ్యవస్థాపకులు జెట్టి కుసుమకుమార్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఐతానగర్‌లో కేజీఎఫ్ జెండా లోగోను ఆవిష్కరించారు. 2026 జనవరిలో చైన్నైలోని మధురామ్‌లో 10 లక్షల మంది అమ్మవారితో మహానాడును ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కేజీఎఫ్ తెనాలి అధ్యక్షుడు జెట్టి శివరామకృష్ణప్రసాద్, జెట్టి రావణాబ్రహ్మ, అన్నే చంద్రశేఖర్, నాగేశ్వరరావు, నాగభూషణం, సాయి, నన్నపనేని రఘువీర్, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

### చికిత్స పొందుతూ యువకుడు మృతి

**తెనాలి రూరల్:** రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. పట్టణ ఇస్లాంపేటకు చెందిన సుభాని(31) మార్కెట్ ఏరియాలో కార్పెంటర్‌గా పని చేస్తున్నారు. గత నెల 23వ తేదీన రాత్రి పని చేసి ఇంటికి వస్తూ తన ద్విచక్రవాహనం అదుపుతప్పి కింద పడ్డారు. దీంతో తలకు గాయమవ్వడంతో కుటుంబ సభ్యులు చినకాకానిలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆ యువకుడు సోమవారం మృతి చెందాడు. వైద్యశాల నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్ టౌన్ పోలీసులు తెలిపారు.

### నేడు తాడికొండలో న్యూరాలజీ సేవలు

**తాడికొండ:** నేడు తాడికొండలోని గ్రామీణ ఆరోగ్య కేంద్రంలో న్యూరాలజీ వైద్య సేవలు ఉచితంగా అందించనున్నట్లు ఆసుపత్రి విభాగం ఒక ప్రకటనలో తెలిపింది. గుంటూరు మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్, ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ సుందరాచారి అవుట్ పేషెంట్ సేవలు అందుబాటులో ఉంటాయని, ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు నరాలు, మెదడుకు సంబంధించిన వైద్య సేవలు అందించబడతాయని, తాడికొండ పరిసర ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు.

### మహిళలకు కుట్టు శిక్షణ ప్రారంభం

**దుగ్గిరాల:** స్త్రీ శక్తి ద్వారా కుట్టు మిషన్ శిక్షణ ప్రారంభించినట్లు తద్వారా మహిళల ఆర్థిక ఎదుగుదలకు సహకరిస్తుందని ఎంపీపీ షేక్ జబీన్ తెలిపారు. సోమవారం రేవేంద్రపాడు గ్రామంలోని కుట్టు మిషన్ సెంటర్‌ని ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ స్త్రీలు సొంతంగా ఎదిగేందుకు స్వయం ఉపాధిలో భాగంగా, ఆర్థిక స్వావలంబనకు ఈ శిక్షణ ఉపయోగపడుతుందని అన్నారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్‌తో పాటు కుట్టు మిషన్ అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో యార్డు చైర్మన్ వి.ఝాన్సీరాణి, కె.శ్రీ అనిత, గ్రామ సర్పంచ్ పి.మేరిమ్మ తదితరులు పాల్గొన్నారు.

# అలంకార ప్రాయంగా మున్సిపల్ కబేళా!

- 11 ఏళ్లుగా జరగని పశు వైద్యుని నియామకం
- ప్రతిపాదనలకే పరిమితమైన వాటర్ ట్యాంక్ నిర్మాణం
- కబేళా ముందు యథేచ్ఛగా మాంసం విక్రయాలు

**తెనాలి పురపాలక సంఘ పరిధిలోని కబేళా అలంకార ప్రాయంగా మారింది. ఇది నిరుపయోగంగా మారి 11 ఏళ్లు దాటుతున్నా దీనిని పట్టించుకున్న వారు కరువయ్యారు. కనీసం పశు వైద్యుని నియామకం కోసం కూడా ప్రయత్నించని పరిస్థితి ఏర్పడింది. దీంతో వేలం పాట పాడుకున్న వారు తమ పశువులను అక్కడే పెంచుకుంటూ కాలం వెళ్లబుచ్చుతున్నారు.**



నిరుపయోగంగా దర్శనమిస్తున్న పురపాలక సంఘం పరిధిలోని కబేళా

**తెనాలి అర్బన్:** తెనాలి పట్టణంలో సుమారు 1.60 లక్షల జనాభా ఉంటారు. పట్టణ జనాభా పెరుగుతుండడంతో మాంసాహార ప్రియులూ పెరిగారు. దీంతో తెనాలి పురపాలక సంఘ అధికారులు ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ముత్తింశెట్టిపాలెంలో గతంలో కబేళాను నిర్మించారు. అలాగే అక్కడ ఒక పశువైద్యుడిని, మాంసం కోసే వ్యక్తిని, వాచ్‌మెన్‌ను నియమించారు. అలాగే హలాల్ చేసేందుకు ఒక ముస్లిం వ్యక్తిని కూడా అందుబాటులో ఉంచారు. వీరు వ్యాపారులు తెచ్చే గొర్రెలు, కోళ్లు, గేదెలను పరీక్షించి.. అవి ఆరోగ్యంగా ఉంటే వాటిని కోసేందుకు అనుమతి ఇస్తారు. పశువులు అనారోగ్యంగా ఉంటే వాటిని కోసేందుకు అనుమతి ఇవ్వరు. అలాగే పశువులను అక్కడే కోసి తీసుకువెళ్లాల్సి ఉంటుంది. పట్టణంలో మటన్, చికెన్ షాపులు సుమారు రెండు వందలకు పైగా ఉన్నాయి. వీరందరూ రోజూ కబేళాకు వచ్చి వారు కోసి అమ్మే మాంసాలను పరీక్షలు జరిపించి అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. అలాగే కబేళా నిర్వహణను వేలంపాట ద్వారా వ్యాపారులకు అప్పగిస్తారు. దీంతో మున్సిపాలిటీకి ఏడాదికి సుమారు రూ.5 లక్షలకు పైగా ఆదాయం సమకూరేది.

**ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ నిర్మాణానికి కౌన్సిల్ అనుమతి..**

తెనాలి మున్సిపాలిటీ సరఫరా చేసే రక్షిత మంచినీరు 17, 18, 19, 20 వార్డులలో ఫోర్సుగా రావడంలేదు. దీనిపై పలుమార్లు కౌన్సిలర్‌లు, ఇంజినీరింగ్ అధికారులు ఫిర్యాదు చేశారు. సమీపంలో వాటర్ ట్యాంక్ నిర్మిస్తే సమస్య పరిష్కారం అయ్యే అవకాశం ఉంటుందని ఇంజినీరింగ్ అధికారులు భావించి ఆ విషయాన్ని కౌన్సిలర్‌లకు తెలియజేశారు. దీంతో వారు నిరుపయోగంగా ఉన్న కబేళాలో కేంద్ర ప్రభుత్వం పరిధిలోని అమృత్ పథకంలో రూ.3 కోట్లతో ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ నిర్మించాలనే ప్రతిపాదన మున్సిపల్ కౌన్సిల్ ముందుకు తెచ్చారు. దీంతో కౌన్సిల్ ఆమోదించింది. వెంటనే ఆ ప్రతిపాదనను అధికారులు ఉన్నతాధికారులకు పంపారు. రెండేళ్లు దాటినా నేటికీ దానికి అనుమతులు రాలేదు.

#### కబేళా నిర్వహణ గాలికి..

ముత్తింశెట్టి పాలెంలోని కబేళా నిర్వాహణను మున్సిపల్ అధికారులు 11 ఏళ్ల నుంచి గాలికి వదిలేశారు. దానిలో పనిచేసే వైద్యుడు బదిలీపై వెళ్లడంతో అప్పటి నుంచి దాని ఊసే అధికారులు మరిచారు. చేసేది లేక అక్కడ నివసించే కొందరు వ్యాపారులు దానిలో ఎటువంటి పరీక్షలు జరపకుండా మాంసాలను కబేళా ముందు విక్రయిస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది.



కబేళా బయట మాంసం విక్రయాలు

#### పశువైద్యుని నియామకానికి చర్యలు..



కబేళాలో ఎప్పటి నుంచో పశువైద్యుడు లేరు. వైద్యుడిని నియమించాలని ఉన్నతాధికారులను గతం నుంచి అధికారులు కోరుతూ వచ్చారు. మరోసారి ప్రతిపాదనలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపుతాం. ఆసక్తి ఉన్న పశువైద్యులు మున్సిపాలిటీ కార్యాలయంలో సంప్రదించాలి.

–వీఎం లక్ష్మీపతిరావు, ఇన్‌చార్జి కమిషనర్, తెనాలి పురపాలక సంఘం

# సమస్యల పరిష్కారానికి కృషి



అర్జీలు స్వీకరిస్తున్న అధికారి



అర్జీ స్వీకరిస్తున్న కార్యాలయ ఏవో శ్రీధర్‌బాబు

**తెనాలి టౌన్:** స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించి ప్రజాసమస్యల పరిష్కార వేదికకు పలు అర్జీలు వచ్చినట్లు ఇన్‌చార్జి కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు పేర్కొన్నారు. ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి మంచినీటి కుళాయి కనెక్షన్ ఉన్నప్పటికీ సరఫరా లేదని.. మంచినీరు అందని పరిస్థితుల్లో వాటర్ ట్యాక్స్‌ను మాఫీ చేయాలని.. టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించి బహిరంగ ప్రదేశాల్లో ఉన్న ఆక్రమణలు తొలగించాలని పలు అర్జీలు వచ్చినట్లు చెప్పారు. సమస్యలను పరిశీలించి వీలైనంతా త్వరగా పరిష్కరిస్తామని ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో రెవెన్యూ ఆఫీసర్ రాంప్రసాద్, మేనేజర్ జయకర్, తదితరులు పాల్గొన్నారు.

**తెనాలి టౌన్:** స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 15 అర్జీలు వచ్చినట్లు కార్యాలయ పరిపాలనాధికారి శ్రీధర్‌బాబు తెలిపారు. కొల్లిపర మండలం వల్లభాపురానికి చెందిన రవిబాబు కొన్నేళ్లుగా కిడ్నీ సమస్యతో బాధపడుతున్నట్లు, తమకు ట్రాన్స్‌ప్లాంటేషన్ కోసం ఆర్థిక సాయం చేసి ప్రాణాలు కాపాడాలని కోరినట్లు తెలిపారు. వారంలో రెండు సార్లు డయాలసిస్ చేయాల్సి ఉందని.. ఉన్న కొద్దిపాటి స్థలం అమ్మి ఇంతకాలం వైద్యానికి ఖర్చు చేసినట్లు అధికారుల ఎదుట ఆవేదన చెందారు. దాతలు, ప్రభుత్వం చికిత్సకు సాయం అందించాలని కోరారు. అదే విధంగా తెనాలి మండలం కఠెవరం గ్రామానికి చెందిన యర్రు సాంబశివరావు గ్రామంలోని బీసీ కాలనీలో రోడ్డుకు ఇబ్బందిగా ఏర్పాటు చేసిన దుకాణం తొలగించాలని, వాహన రాకపోకలకు ఆటంకం లేకుండా చూడాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని అర్జీ ఇచ్చినట్లు చెప్పారు. అలానే రెవెన్యూకి సంబంధించి 4, మున్సిపాలిటీ 3, పోలీసు 3, మెడికల్ 1, ఇరిగేషన్ 2, పంచాయతీరాజ్‌కి సంబంధించి 1 అర్జీ వచ్చినట్లు తెలియజేశారు. అర్జీలను పరిశీలించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

### ఉన్నతాధికారుల నిర్ణయంతోనే ప్రైవేటు ఏజెన్సీకి

**తెనాలి రూరల్:** తెనాలి టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ ఆవరణలోని కస్టమర్ సర్వీస్ సెంటర్‌ను ప్రైవేటు ఏజెన్సీకి అప్పగించడం ఉన్నతాధికారుల నిర్ణయమేనని తెనాలి బీఎస్ఎన్ఎల్ ఆపరేషన్స్ డీఈ శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం సాయంత్రం ఆయన విలేకర్లతో మాట్లాడారు. కస్టమర్ సర్వీస్ సెంటర్‌ను ప్రైవేటు ఏజెన్సీకి ఇవ్వడాన్ని నిరసిస్తూ మహిళా ఉద్యోగి నిరసన దీక్ష చేపట్టిన నేపథ్యంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఔట్‌సోర్సింగ్ కస్టమర్ కేర్ సెంటర్ ఏర్పాటు చేయాలని రెండు రోజుల క్రితం ఆదేశాలు రావడంతో సోమవారం ఏర్పాటు చేశామని.. ఇవన్నీ ఉన్నతాధికారుల నిర్ణయంలో ఓపెన్ టెండర్ ద్వారా ఏజెన్సీని ఎంపిక చేశారని ఆయన వివరించారు.

### అమ్మవారి ఆలయంలో చోరీ

**దావులూరిపాలెం (కొల్లిపర):** మండల పరిధిలోని దావులూరిపాలెం ఆలయంలో దుండగులు చోరీకి పాల్పడిన సంఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. దీనిపై ఆలయ కమిటీ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. దావులూరిపాలెంలోని రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయంలో దొంగలు హుండీలోని సుమారు రూ.20 వేలు చోరీ చేసినట్లు తెలిపారు. రోజూలానే తెల్లవారు జామున పండితులు ఆలయం వద్దకు వచ్చారు. ఆలయంలోని ప్రధాన గుడి తలుపులు తెరిచి ఉండడంతో పాటు హుండీ తాళాలు పగలగొట్టి ఉన్నాయి. దీంతో అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు ఎస్ఐ కోటేశ్వరరావుకు సమాచారం అందించారు. ఎస్ఐ సంఘటనా స్థలాన్ని పరిశీలించి కమిటీ సభ్యులు అందిచిన వివరాల ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

### చేనేత కళాకారుల ర్యాలీ

**మంగళగిరి టౌన్:** చేనేతలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నిలబెట్టుకున్న సందర్భంగా కృతజ్ఞతగా మంగళగిరి నగర పరిధిలో సోమవారం చేనేత కళాకారులు ర్యాలీ నిర్వహించారు. పాత మంగళగిరి భద్రావతి సమేత భావనారుషి స్వామి వార్ల దేవస్థానం నుంచి హుస్సేన్ కట్ట, మిద్దె సెంటర్, మెయిన్ బజారు మీదుగా లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం వరకు 100 అడుగుల చీరతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పద్మశాలీ కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య, ఏపీ ఎంఎస్ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, టీడీపీ పాలకమండలి సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, చేనేత వృత్తిదారులు, కళాకారులు, చేనేత కుటుంబ సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# టిడ్కో కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలి



తహసీల్దార్ గోపాలకృష్ణకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

**తెనాలి రూరల్:** టిడ్కో కాలనీ వాసుల సమస్యలు పరిష్కరించాలని సీపీఎం నాయకులు తహసీల్దార్ గోపాలకృష్ణకు సోమవారం వినతిపత్రం అందజేశారు. నాయకులు కె.బాబుప్రసాద్ మాట్లాడుతూ.. పురపాలక సంఘ పరిధిలో నిర్మించిన టిడ్కో గృహాలను అసంపూర్తిగా వదిలేయడంతో అక్కడి నిర్వాసితులు ఇబ్బందులకు గురవుతున్నట్లు తెలిపారు. పట్టణానికి రెండు కిలోమీటర్ల దూరంలో నిర్మించిన టిడ్కో గృహాల్లో ప్రస్తుతానికి 300 మంది లబ్ధిదారులు నివసిస్తున్నారని.. అక్కడ మౌలిక సదుపాయాలు అంతంత మాత్రంగా ఉన్నాయని.. పక్కా రహదారి కూడా లేదని అన్నారు. ఈ సందర్భంగా పలు వినతులతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్‌కు అందించారు. కార్యక్రమంలో నాయకులు షేక్ హుస్సేన్ వలి, టిడ్కో కాలనీ అభివృద్ధి కమిటీ నాయకులు కె.శ్రీనుబాబు, షేక్ నాగూర్, పాల్గొన్నారు.

# కార్పొరేట్ శక్తుల గుప్పెట్లో మోదీ ప్రభుత్వం

**సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్**



మాట్లాడుతున్న జంగాల అజయ్‌కుమార్

**మంగళగిరి టౌన్:** ప్రధాని మోదీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తుల గుప్పెట్లో నడుస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జంగాల అజయ్ కుమార్ విమర్శించారు. మంగళగిరి నగర పరిధిలోని సీపీఐ కార్యాలయంలో సోమవారం పార్టీ నియోజకవర్గ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జంగాల మాట్లాడుతూ మోదీ నాయకత్వంలో అధికారంలోకి వచ్చిన ఎన్‌డీఏ ప్రభుత్వం దేశ ఆర్థిక, పారిశ్రామిక వ్యవస్థలను గుజరాత్ కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మోదీ ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను అవలంభిస్తూ ఆర్థిక వ్యవస్థను ఛిన్నాభిన్నం చేశారని అన్నారు. ఈ నెల 17, 18 తేదీల్లో జరిగే జిల్లా మహాసభలను, 23, 24, 25 తేదీల్లో ఒంగోలులో జరుగనున్న రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నియోజకవర్గ సహాయ కార్యదర్శి యార్లగడ్డ వెంకటేశ్వరరావు, కంచర్ల కాశయ్య, నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, పట్టణ కార్యదర్శి ప్రభాకర్, మండల కార్యదర్శి జాలాది జాన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

### నృసింహుని ఆలయ ధర్మకర్తల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

**మంగళగిరి టౌన్:** మంగళగిరి నగర పరిధిలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ ధర్మకర్తల సభ్యుల నియామకానికి దరఖాస్తు చేసుకోవాలని ఆలయ కార్యనిర్వహణాధికారి సునీల్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు దేవస్థానంలోని కార్యాలయంలో దరఖాస్తు ఫారం తీసుకుని పూర్తి చేసి ఈ నెల 26వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు కార్యాలయంలో అందజేయాలని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

### మృతదేహం లభ్యం



**తాడేపల్లిరూరల్:** తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఉండవల్లి దళితవాడ కరకట్ట మధ్యలో ఉన్న గుంటూరు చానల్ హెడ్ స్లూయిస్ వద్ద కాలువ నీటిలో గల్లంతైన వ్యక్తి మృతదేహాన్ని తాడేపల్లి పోలీసులు సోమవారం వెలికి తీశారు. ఎస్ఐ స్వామి శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం ఉండవల్లి దళితవాడ కరకట్ట వెంబడి పుష్కరాల నివాసాల్లో బంధువుల ఇంటికి వచ్చి సరదాగా ఈతకు గుంటూరు చానల్‌లోకి దిగిన జంపల భవానీ శంకర్ (35) నీటిలో మునిగి గల్లంతయ్యాడు. బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆది, సోమవారాల్లో గుంటూరు చానల్‌లో గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టగా గుంటూరు కాలువ హెడ్ స్లూయిస్ సమీపంలో మునిగిపోయిన భవానీ శంకర్ మృతదేహం నీటి ఒరవడికి కొట్టుకుపోయింది. నులకపేట హెడ్ స్లూయిస్ మధ్యలో లభ్యమయిందని, పోస్టుమార్టం నిమిత్తం మంగళగిరి ఏరియా ఆసుపత్రికి మృతదేహాన్ని తరలించామని, జరిగిన ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ స్వామి శ్రీనివాసరావు తెలిపారు.

# ఆర్గానిక్ కూరగాయలతో ఆరోగ్యం



కూరగాయలు కొనుగోలు చేస్తున్న శ్రీనివాసరావు

**తెనాలి టౌన్:** ప్రకృతి వ్యవసాయంతో పండించిన కూరగాయలు వినియోగించడం వల్ల ఆరోగ్యం చేకూరుతోందని మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్ ఎ.శ్రీనివాసరావు పేర్కొన్నారు. సోమవారం స్థానిక కొత్తపేటలోని మండల పరిషత్ కార్యాలయంలో ఆర్గానిక్ కూరగాయల అమ్మకాన్ని ఆయన ప్రారంభించారు. ప్రతి సోమవారం మండల పరిషత్, కలెక్టరేట్ కార్యాలయాల్లో ఆర్గానిక్ పంటలకు సంబంధించిన ఉత్పత్తులను విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఎటువంటి ఎరువులు, పురుగు మందులు వాడకుండా ప్రకృతి వ్యవసాయ క్షేత్రంలో పండించిన పంటలనే విక్రయిస్తున్నట్లు ఆయన తెలిపారు. కూరగాయలు వినియోగించడం వల్ల మంచి పోషకాహారం, ఆరోగ్యం చేకూరుతుందని చెప్పారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని సూచించారు. ఏటీఎం మోడల్, ఏగ్రేడ్ మోడల్ ద్వారా వచ్చిన కూరగాయలు ఇక్కడ స్టాల్‌లో విక్రయిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎరుకులపూడి యూనిట్ ఇన్‌చార్జి టి.విజయలక్ష్మి, తెనాలి డివిజన్ మాస్టర్ ట్రయినర్ ఆర్.శ్రీనివాసరావు, ఐసీఆర్‌పీ కె.ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

# సీబీఎస్‌సీ క్లస్టర్స్ అథ్లెటిక్స్‌లో విజయం



విద్యార్థిని అశ్లేషారాను అభినందిస్తున్న డైరెక్టర్ యానీ అరుణలత

**తెనాలి టౌన్:** ఆంధ్రా, తెలంగాణ సీబీఎస్‌సీ క్లస్టర్స్, అథ్లెటిక్స్ నందు సెయింట్‌జాన్స్ ఇంగ్లిషు మీడియం స్కూల్ విద్యార్థిని ఎం.అశ్లేషారా ఘన విజయం సాధించినట్లు స్కూల్ కరస్పాండెంట్ డాక్టర్ సూరజ్‌మోహన్, డైరెక్టర్ యానీ అరుణలత పేర్కొన్నారు. సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో డాక్టర్ సూరజ్‌మోహన్ మాట్లాడారు. ఈనెల 8, 9, 10 తేదీల్లో నెల్లూరులో జరిగిన అథ్లెటిక్స్ పోటీల్లో అండర్–14 బాలికల హైజంప్ విభాగంలో తమ విద్యార్థిని ఆశ్లేషారా ప్రథమ బహుమతి సాధించి గోల్డ్ మెడల్ కైవసం చేసుకున్నట్లు తెలిపారు. విద్యార్థుల ప్రగతికి విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక కళలను ప్రోత్సాహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల పీఈటీ, తదితరులు పాల్గొన్నారు.

# ఎరువుల దుకాణంలో తనిఖీలు



రికార్డులను తనిఖీ చేస్తున్న ఏవో శ్రీనివాసరెడ్డి

**కొల్లిపర:** రైతులు ఎటువంటి అపోహాలను పెట్టుకోకుండా ఏ రకమైన పంటలకైనా నానో యూరియా, డీఏపీ వాడవచ్చునని ఏవో ఎస్.శ్రీనివాసరెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని ఎరువుల దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎరువుల వ్యాపారులు ఎవరైనా ఎరువులు, పురుగు మందులు కృత్రిమ కొరత సృష్టించినా, అధిక ధరలకు విక్రయించినా అటువంటి వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు వారి లైసెన్స్‌లను పూర్తిగా రద్దు చేస్తామని హెచ్చరించారు. రైతులు నానో యూరియా, డీఏపీ వాడడం వల్ల గతంలో మాదిరిగానే పంటలు పెరుగుదల, దిగుబడి పెరుగుతుందని.. నేల, నీరు, వాయు కాలుష్యాన్ని తగ్గిస్తుందని వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

# పుట్టపర్తికి వాటర్ బాటిల్స్ తరలింపు



తరలిస్తున్న వాటర్ బాటిల్స్‌తో కుమార్‌పంప్స్ ప్రతినిధులు

**తెనాలి టౌన్:** పుట్టపర్తి సత్యసాయిబాబా శతజయంతిని పురస్కరించుకుని స్థానిక సుల్తానాబాద్‌లోని ఇండస్ట్రీయల్ ఎస్టేట్‌నందలి కుమార్‌పంప్స్ ఆధ్వర్యంలో పుట్టపర్తికి లక్ష లీటర్ల మినరల్ వాటర్ బాటిల్స్, ఐదు టన్నుల నిమ్మకాయ పచ్చడి ఉచితంగా పంపిస్తున్నట్లు కుమార్‌పంప్స్ ఎండీ సతీమణి కొత్త వసుంధర తెలిపారు. సోమవారం స్థానిక కుమార్‌పంప్స్ కార్యాలయంలో బాటిల్స్‌ను తరలించే ప్రక్రియ చేపట్టారు. నవంబరు 16 నుంచి 23 వరకు సత్యసాయిబాబా శతజయంతి వేడుకలు పుట్టపర్తిలో వైభవంగా జరుగనున్నట్లు చెప్పారు. రాష్ట్రం మొత్తం మీద 26 జిల్లాల నుంచి 290 మంది ప్రతినిధులు బొమిడాల కల్యాణ మండపంలో సమావేశమయ్యి సేవలందించనున్నట్లు చెప్పారు. పాడేరులోని ఆదివాసులకు రూ.10 లక్షలు విలువ చేసే ఫినోలెక్స్ పైపులు ఉచితంగా ఇవ్వనున్నట్లు తెలిపారు. నవంబరు 23న సత్యసాయిబాబా పుట్టినరోజును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పండుగ రోజుగా ప్రకటించడం సంతోషనీయమని చెప్పారు. కార్యక్రమంలో మేనేజర్ కొడాలి మల్లీశ్వరి, సంపూర్ణ, తదితరులు పాల్గొన్నారు.

# కాలేయ వ్యాధులపై గ్రామస్తులకు అవగాహన



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న కేఎల్‌యూ విద్యార్థులు

**తాడేపల్లిరూరల్:** తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ ఫార్మసీ విభాగాల ఆధ్వర్యంలో సోమవారం దుగ్గిరాల మండల పరిధిలోని పెదకొండూరు గ్రామంలో కాలేయ వ్యాధులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ ప్రొఫెసర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఆర్.సుప్రియ మాట్లాడుతూ హెపటైటిస్ (కాలేయం) వ్యాధిపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని, కొన్ని జాగ్రత్తలు పాటిస్తే కాలేయాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. కలుషిత ఆహారం, నీరు, రక్తం, వాడిన సూదులు తిరిగి వాడడం, టాటూలు వేయించుకోవడం, టూత్ బ్రష్‌లు, బ్లేడ్‌లు తదితర వాటి ద్వారా కాలేయ వ్యాధులు వచ్చే అవకాశం ఉందని వలంటీర్లు గ్రామస్తులకు వివరించారు. కళ్లు, చర్మం పసుపు రంగులోకి మారటం, మూత్రం ముదురు రంగులో రావడం, ఆకలి తగ్గటం, అలసట, కడుపునొప్పి, వాంతులు లక్షణాలుగా ఉంటాయని తెలిపారు. లివర్ ఫంక్షనింగ్ టెస్ట్, హెపటైటిస్ ప్యానల్, పీసీఆర్ టెస్ట్, అల్ట్రాసౌండ్ స్కాన్ తదితర పరీక్షల ద్వారా వ్యాధిని గుర్తించవచ్చని, హెపటైటిస్‌లో ఎ, బి, సి, డి రకాలు ఉంటాయని వివరించారు. ఎన్ఎస్ఎస్ ఫీల్డ్ కో ఆర్డినేటర్ సురేష్, వలంటీర్లను వర్సిటీ వీసీ డాక్టర్ జి.పార్థసారధి వర్మ, ప్రో వీసీలు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్రామ్, డాక్టర్ కె.రాజశేఖరరావు, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.చక్రవర్తి, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్, డీన్ సలహాదారులు డాక్టర్ హబీబుల్లా ఖాన్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ పి.శ్రీకాంత్‌రెడ్డి తదితరులు అభినందించారు.

# ఎన్నికల ముందు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలి

**తాడేపల్లి రూరల్:** విద్య, ఐటీ శాఖల మంత్రి, మంగళగిరి ఎమ్మెల్యే నారా లోకేష్ ఎన్నికల ముందు కార్మికులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు, ఐఎఫ్‌టీయూ నాయకులు కె.ఆదినారాయణ డిమాండ్ చేశారు. సోమవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు గత 251 రోజులుగా రిలే నిరాహార దీక్ష చేస్తున్న శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలియజేశారు. ఎన్నికలకు ముందు నారా లోకేష్ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యను తీరుస్తానని హామీ ఇచ్చారని, ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆదినారాయణ, కేసీ వర్క్స్ యూనియన్ కార్యదర్శి కూరపాటి స్టీవెన్ సుభాని, యెహోషువా, పిచ్చయ్య, గురవయ్య, కార్మికులు పాల్గొన్నారు.